28032025-DIS-04_Layout 1 3/28/2025 1:56 AM Page 1



నమస్తే తెలంగాణ

న్యాయ వ్యవస్థకు అగ్నిపరీక్ష

ప్రజాస్వామ్య వ్యవస్థ మూలాధార స్తంభాల్లో అతి కీలకమైనది న్యాయవ్యవస్థ. అన్యాయాలు, అక్రమాలు జరిగినప్పుడు ప్రజలు చివరాఖరి దిక్కుగా న్యాయవ్యవస్థ వైపు చూస్తారు. కానీ, ఇటీవలి కాలంలో న్యాయదేవత ప్రభ మసకబారుతున్నది. కొందరు న్యాయమూర్తుల ప్రవర్తన, తీర్పులు వివాదాస్పదమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్ని ప్రమాదం కారణంగా అనుకోకుండా బయటపడిన సగం కాలిన నోట్ల కట్టల ఉదంతంతో దేశం ఉలిక్కిపడింది. ఇప్పటివరకు న్యాయవ్యవస్థపై వివాదాలెన్నో వచ్చాయనేది కాదనలేం. కానీ, ఇది అలాంటిది కాదు. డబ్బుతో ముడిపడిన అంశం కావడమే అందుకు కారణం. ఈ ఘటనపై నిజానికి మొత్తంగా న్యాయవ్యవస్థే ప్రకంపనలకు గురైనట్టు కనిపిస్తున్నది. ప్రథమ స్పందనల్లో వ్యక్తమైన గందరగోళం, తత్తరపాటు అలాంటి అభిప్రాయం కలగడానికి కారణమని చెప్పవచ్చు.

ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తుల నియామక ప్రక్రియ, తొలగింపు పద్ధతులు సంక్లిష్టంగానూ, గోప్యంగానూ ఉంటాయనేది తెలిసిందే. వీటిని పర్యవేక్షించే కొలీజియం ఉన్నపళంగా జస్టిస్ వర్మను అలహాబాద్‌కు బదిలీచేసింది. నిజానికి బదిలీ అనేది జరిగినదానికి ఒక పరిష్కారంగా ప్రజలు చూడటం లేదు. డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? అది న్యాయమూర్తి అధికార నివాసానికి ఎలా చేరింది? అనేది తేల్చుకునేందుకు సుప్రీంకోర్టు ఒక దర్యాప్తు సంఘాన్ని వేసింది. తర్వాత ఒకవేళ అవినీతి జరిగినట్టు తేలితే ఏం చేయాలనేది ప్రశ్న. ఎందుకంటే ఒక హైకోర్టు జడ్జీని తొలగించాలంటే అది రాష్ట్రపతి ద్వారానే జరగాలి. అది కూడా ఉభయ సభల్లో తీర్మానం జరిగిన తర్వాతనే. ఆ సంగతి అలా ఉంచితే జస్టిస్ వర్మ ఆ డబ్బుతో తనకు సంబంధం లేదని ఖండిస్తున్నారు. నిజానిజాలు తెలుసుకోకుండానే తనను దోషిగా మీడియా తేలుస్తున్నదని ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ సంగతి తేల్చుకునేందుకే సుప్రీం నియమించిన మూడు రాష్ర్టాలకు చెందిన ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తుల దర్యాప్తు కమిటీ జస్టిస్ వర్మ ఇంటిని సందర్శించి వివరాలు సేకరించింది. ఘటనల క్రమాన్ని బట్టి ఇదొక అసాధారణమైన కేసు అని మాత్రమే ప్రస్తుతానికి చెప్పవచ్చు.

సహజంగానే న్యాయమూర్తి ఇంటి నోట్ల కట్టల వ్యవహారంపై రాజకీయ దుమారం మొదలైంది. జాతీయ రాజకీయపక్షాలు ఎవరికి వారు తమదైన దృష్టికోణంలో నుంచి ఈ వ్యవహారాన్ని చూస్తున్నాయి. ముందుగా బీజేపీ గురించి ఆలోచిద్దాం. ఆ పార్టీ నిగూఢంగా ఉండే కొలీజియం వ్యవస్థను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నదన్నది తెలిసిన సంగతే. న్యాయమూర్తుల నియామకాన్ని కేంద్రం చేతుల్లో పెట్టే జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టం (ఎన్‌జేఏసీ)ని తెచ్చింది అందుకే. దానిని సుప్రీంకోర్టు కొట్టేయడంతో అది అమలులోకి రాకుండానే కాలగర్భంలో కలిసింది. ఇప్పుడు మరోసారి కొలీజియంపై దాడికి పాలక పక్షం ప్రస్తుత ఉదంతాన్ని వాడుకోవాలని చూస్తున్నది. ఆ పార్టీ నేతలు కొలీజియం గోప్యతను దుయ్యబడుతూ చేస్తున్న ప్రకటనలే అందుకు తార్కాణం. జరిగినదానికి బాధ్యతను కేంద్రంపైకి, బీజేపీ నాయకత్వంపైకి తోసేయాలని కాంగ్రెస్ ఎత్తులు వేస్తున్నది. ఏదేమైనప్పటికీ దేశానికి న్యాయం చెప్పే న్యాయవ్యవస్థ ఇప్పుడు ఆత్మపరిశీలన జరుపుకోవాల్సిన సందర్భం ఎదురైంది. ప్రజల సందేహాలను పటాపంచలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దేశ చరిత్రలోనే సంచలనాత్మకమైనదిగా మిగిలిపోయే ఈ కేసులో ఎలా వ్యవహరిస్తుంది? ఇటీవలే కళ్లకు గంతలు తొలగిపోయిన న్యాయదేవత ఈ 'అగ్నిపరీక్ష'లోంచి ఎలా బయటపడుతుంది?అనేది తెలియాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

భాషపై స్వీయనియంత్రణ తప్పనిసరి!

పీవీ ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు 'మీరు ఏదైనా కీలక నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఎలా ఆలోచిస్తారు' అని ఒక విలేకరి ప్రశ్నించగా 'నేను ఏదైనా నిర్ణయం తీసుకునేముందు కాళోజీ స్పందన ఏ రకంగా ఉంటుందోనని కొద్దిసేపు మననం చేసుకుంటాను' అని బదులిచ్చారు.

తుల్జారాం సింగ్ ఠాకూర్
78930 05313

బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రభుత్వాధినేతగా కూర్చున్న పీవీ పక్కా కాంగ్రెస్ వ్యక్తి. అయినా, పీవీపై ఉన్న ప్రభావం అది. ఒక రకంగా చెప్పాలంటే తెలంగాణ అంతటి చైతన్యవంతమైన సమాజం బహుశా భారతదేశంలోనే లేదు. అందుకే, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలు కమ్యూనిస్టు, విప్లవ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాల్లో తెలంగాణ ప్రజల సాహిత్య, సాంస్కృతిక పరిణతి, అదే సమయంలో ఉదారవాద, మానవీయ, ప్రజాస్వామిక లక్షణాలు కనబడుతాయి. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో జరిగిన పొరపాట్లను ఆత్మవిమర్శ చేసుకున్న సమాజం, మలి దశ ఉద్యమంలో మరింత పరిణతిని ప్రదర్శించడమే కాకుండా, తన మిలిటెంట్ స్వభావాన్ని రాజ్యాంగ పరిధిలోనే కొనసాగించింది. అందుకే, ఉద్యమ సమయంలో భాషాపరంగా నినాదాలు, పాటలు ఆంధ్రా ప్రజల నాలుకలపై కూడా నాట్యమాడాయి.

తెలంగాణ ఏర్పాటు అనివార్యతను సృష్టించడంలో కేసీఆర్, జేఏసీ, యావత్ తెలంగాణ సమాజం విజయవంతమైంది. కాబట్టే తెలంగాణ స్వప్నం సాకారమైంది. దక్కన్ పీఠభూమి, బంగారు తునక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం సహజంగానే తనకున్న భౌగోళిక అనుకూలతలను అందిపుచ్చుకొని సమర్థవంతమైన నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి దిశగా పయనించింది. అభివృద్ధి, సంక్షేమాలను సమన్వయ పరచుకొని సాగు, తాగు నీరు, కరెంటు, రోడ్లు, ఐటీ, పారిశ్రామిక తదితర రంగాలన్నింటిలోనూ ఆశించినంత మేర ప్రజలు సంతృప్తి చెందేటట్లుగా పునర్నిర్మాణం చేసుకున్నది. ఉద్యమ సమయంలో ప్రజలను ఉత్తేజపరచడానికి ప్రజలకు చేరేవిధంగా ప్రసంగాలు, మాటలు, పాటలు గ్రామీణ జీవన శైలిని, యాసను పల్లె పదాలను సంతరించుకున్నయి తప్ప బూతును దరి చేరనీయలేదు. ఆంధ్ర నాయకత్వం తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చడానికి, కేసీఆర్ వ్యక్తిగత జీవితాన్ని బహిరంగంగా దిగజార్చడానికి కుయుక్తులతో, కృత్రిమ కవిత్వంతో, అసంబద్ధ కల్పనలతో, అవాస్తవ కథనాలతో ప్రయత్నం చేసినా కేసీఆర్ లక్ష్యపెట్టలేదు. అంతేకాదు, వాళ్లు ప్రవర్తించిన విధంగా ఆంధ్ర నాయకుల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూడలేదు. ఉమ్మడి ఏపీ కాలంలోనూ, తెలంగాణ ఆవిర్భవించిన అనంతరం సుమారు దశాబ్ద కాలం పాటు తెలంగాణలో ఏపీ రాష్ట్రం విడిపోయిన ఐదేండ్ల వరకు ఆయా రాష్ర్టాలలో రాజకీయ పరిస్థితులు కొంతవరకు హుందాగా ఉండేవి. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పార్టీల మధ్య పరస్పర నిందారోపణలు వ్యక్తిగత స్థాయికి దిగజారి కుటుంబంలోని మహిళల వరకు వెళ్లడం జుగుప్సాకర సంఘటనలుగా చెప్పవచ్చు. ఒక దశలో కొంతమంది రాజకీయ నాయకుల మాటల్లోని బూతులు మూడో తరగతి సినిమాల స్థాయి కంటే దిగజారాయి.

దురదృష్టవశాత్తు గత రెండున్నరేండ్ల కాలం నుంచి తెలంగాణలో రాజకీయ విలువలు క్షీణించాయి. పరస్పర వ్యక్తిగత దూషణలతో హుందాతనం కోల్పోతున్న వైనం ప్రజలను అసహనానికి గురిచేస్తున్నది. పార్టీ వేదికల మీదనే కాకుండా దిగజారిన భాషా ప్రయోగం సర్వవ్యాపితమై కూర్చున్నది. పాలకులు.. ప్రతిపక్షాలు, ప్రజల నుంచి వచ్చే విమర్శలకు సంయమనంతో స్పందించాలి. వ్యక్తిగత దాడులు చేయకుండా, సైద్ధాంతికపరమైన చర్చలు ఆరోగ్యకరమైన వాతావరణంలో నిర్మాణాత్మకంగా సాగాలి. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష నాయకులు ఆవేశపూరిత, నిందాపూర్వక ఉపన్యాసాలకంటే వాస్తవిక దృష్టితో ఈ ప్రజా సమస్యలను విశ్లేషించి, పరిష్కార మార్గాలను సూచించే విధంగా మాట్లాడాలి. అటువంటివారినే సమర్థవంతమైన నాయకులుగా, పరిపాలనాదక్షులుగా, ప్రజాప్రతినిధులుగా తెలంగాణ సమాజం చిరస్థాయిగా గుర్తుంచుకుంటుంది.

తెలుగు, హిందీ, ఇంగ్లీషు, కన్నడ, మరాఠీ, పర్షియా, సంస్కృతం వంటి భాషల్లో ప్రావీణ్యం ఉన్న బూర్గుల, పీవీలతో పాటు జలగం వెంగళరావు, తరిమెల నాగిరెడ్డి, ఓంకార్, ఈశ్వరీబాయి, సూదిని జైపాల్ రెడ్డి, అయ్యదేవర కాళేశ్వరరావు, రోశయ్య లాంటివారిని ఆదర్శంగా తీసుకోవాలి. ఇటువంటి వక్తలతో కూడిన అసెంబ్లీలో సమావేశాలు, ప్రసంగాలు జ్ఞానబోధనలుగా సాగేవి. హాస్యోక్తులతో, పరస్పర వ్యంగ్యోక్తులతో ప్రజా సమస్యల మీద అర్థవంతమైన చర్చలు జరిగేవి. కాగా, దురదృష్టవశాత్తు ప్రస్తుతం అధికారపక్ష నాయకులు రాష్ట్ర ప్రభుత్వాధినేత తరచుగా ప్రయోగిస్తున్న భాష ఆక్షేపణీయమని సర్వత్రా చర్చించుకుంటున్నారు.

ప్రతిపక్షాలు నిగ్రహం కోల్పోయి, నిస్పృహతో అప్పుడప్పుడు సంయమన రేఖను దాటినప్పటికీ ప్రభుత్వం, ప్రభుత్వాధినేతలు బాధ్యతగా వ్యవహరిస్తేనే ప్రజలు హర్షిస్తారు. ఎన్నికల సమయంలో, కార్యకర్తల్లో జోష్ నింపడానికి కొన్ని మాటలు తూలినప్పటికీ ప్రజలు పట్టించుకోకపోవచ్చు, కానీ, ఎన్నికలు పూర్తయి అధికారపీఠం ఎక్కి ఏడాదిన్నర దాటిన తర్వాత కూడా భాష మెరుగుపడకపోవడం గర్హణీయం. భాషా ప్రయోగం లాగులు, తొండలు, పేగులు, తొడ్కలు మీదుగా నడిబజారులో బట్టలిప్పడం వరకు రావడం అవాంఛనీయం మాత్రమే కాదు, ఆత్మవిమర్శ చేసుకోవలసిన సందర్భం. ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకొని సాటి రాజకీయ నాయకులపై స్వీయ నియంత్రణ పాటిస్తూ హుందాగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉన్నది. లేనిపక్షంలో భవిష్యత్తు తరాల దృష్టిలో దోషులుగా మిగిలిపోవడమే కాకుండా, చైతన్యవంతులైన తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.

అసెంబ్లీ.. కృష్ణదేవరాయల భువన విజయం, కుతుబ్‌షాహీల అజరామరంల వలె కాకపోయినా, బసవపురాణం నుంచి మహాప్రస్థానం వరకు, క్యాపిటలిజం నుంచి సోషలిజం వరకు చదువుకున్న గతకాలపు పార్లమెంటేరియన్ల వారసత్వాన్ని కొనసాగించాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు.

హైదరాబాద్ ఏకైక ముఖ్యమంత్రిగా సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి, వాగ్వైభవ సంపన్నులు స్వర్గీయ బూర్గుల రామకృష్ణారావు అసెంబ్లీలో చూపించిన వ్యవహారదక్షత నేటి తరానికి పాఠ్యాంశాల వంటివి. అవసరమైనప్పుడు సభలో ఆయన ప్రత్యర్థులను తన సునిశితమైన మాటలతో చీల్చి చెండాడేవారు కానీ, ఆ ప్రయత్నంలో ఎదుటివారు ఆవగింజంతైనా నొచ్చుకునేవారు కాదు. కారణం తన ప్రసంగంలో వ్యవహార సంబంధమైన వ్యాఖ్యలే కానీ, వ్యక్తిగత విషయాలను స్పృశించని హుందాతనం వారిది.

తెలుగు భాషకు అన్యాయం!

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-1 ప్రధాన పరీక్షలో తెలుగు మీడియంలో రాసిన అభ్యర్థులకు తక్కువ మార్కులు, ఇంగ్లీష్ మీడియంలో రాసిన అభ్యర్థులకు ఎక్కువ మార్కులు వచ్చాయని ఆరోపణలు వస్తున్నాయి. తెలుగు అధికార భాషగా ఉన్న రాష్ట్రంలోనే తెలుగు భాషకు అన్యాయం జరిగిందని అభ్యర్థులు వాపోతున్నారు. గ్రూప్-1 ప్రధాన పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించినవారు నలభై ఏండ్లలోపు వారే ఉన్నారని ప్రధానంగా ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలలో నిజమెంత అనే అంశాలను టీజీపీఎస్సీ తేటతెల్లం చేయాలి.

టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రధాన పరీక్షల వాల్యుయేషన్‌పై ఒక ప్రెస్‌నోట్ విడుదల చేస్తూ అత్యధిక మార్కులు సాధించిన మొదటి వంద లోపు వారిలో కులాల వారీగా, జెండర్ వారీగా ఎంతమంది ఉన్నారో తెలియజేసింది. ఒక్కొక్క పేపర్‌లో అభ్యర్థులు సాధించిన గరిష్ఠ మార్కులు ఎంతనే విషయం కూడా నోట్‌లో తెలిపింది. మూల్యాంకనం ఎన్ని రోజులు జరిగింది, ఏ పేపర్‌ను దిద్దడానికి ఎంతమంది ప్రొఫెసర్‌లను తీసుకున్నారనే విషయం కూడా అందులో తెలిపింది. కానీ, అదే ప్రెస్‌నోట్‌లో గ్రూప్-1 ప్రధాన పరీక్షల ఫలితాల ఆలస్యానికి ఎంఎల్‌సీ ఎన్నికల 'ఎన్నికల ప్రవర్తనా నియామవళి' (ఎంసీసీ) ఒక కారణం అని తెలిపింది. కానీ, ఎమ్మెల్సీ ఎన్నికల ఎంసీసీ అమలులో ఉన్న సమయంలోనే టీజీపీఎస్సీ సీడీపీఓ పరీక్షల జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్‌ఎల్)ను ప్రకటించడం గమనార్హం. అంటే సీడీపీఓ పోస్టుల ఫలితాలకు వర్తించని 'ఎన్నికల ప్రవర్తనా నియమావళి', గ్రూప్-1 ఫలితాలకే వర్తిస్తుందా? ఇక్కడనే టీజీపీఎస్సీ లోపభూయిష్టత బయటపడింది. గ్రూప్-1 మార్కుల విషయమై ప్రధాన మీడియా, సోషల్ మీడియాల్లో ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో టీజీపీఎస్సీ తన విశ్వసనీయతను, నిజాయితీని నిరూపించుకోవాలి.

గ్రూప్-1 ప్రధాన పరీక్షల 'కీ'ని బహిరంగపరచాలి. వాల్యుయేషన్ చేసిన ప్రొఫెసర్‌ల వివరాలు 'మీడియం' వారీగా తెలియజేయాలి. మొదటి వంద మంది, వేయి మంది, అభ్యర్థుల్లో మీడియం వారీగా, వయస్సు వారీగా ఎంతమంది ఉన్నారో బహిర్గతం చేయాలి. ఈ వివరాలను గణాంకాలతో సహా తెలియజేయకుంటే ఆందోళనలు ఎక్కువై గ్రూప్-1 ఫలితాలు కోర్టు వివాదాల్లో చిక్కుకునే ప్రమాదం ఉన్నది. వీలైతే యూపీఎస్సీ సమక్షంలో యాదృచ్ఛికంగా మీడియం వారీగా కొన్ని పేపర్‌లను పునర్ మూల్యాంకనం చేయాలి. అప్పుడే తెలుగు మీడియం అభ్యర్థుల్లో విశ్వాసాన్ని ప్రోది చేసినవారవుతారు.

- శాగ శ్రీనివాస్

తెలంగాణ భావోద్వేగం.. కేసీఆర్

తెలంగాణ భారత స్వాతంత్య్ర పోరాటం తర్వాత అంతే శాంతియుతంగా జరిగింది తెలంగాణ ఉద్యమం. ఉద్యమమే నాయకులను సృష్టిస్తుంది కానీ, ఆ నాయకులు ఆ ఉద్యమాన్ని కడదాకా తీసుకువెళ్లినప్పుడే వారి పేరు చిరస్మరణీయమవుతుంది. తెలంగాణ ఉద్యమంలో ఎందరో నాయకులు ఇలా వచ్చారు, అలా వెళ్లారు. కానీ, 2001లో స్వరాష్ట్ర సాధన జెండా ఎత్తిన ఆ వ్యక్తి మాత్రం గమ్యాన్ని ముద్దాడే వరకు ఎత్తిన జెండా దించలేదు. ప్రాణం మీదికి వచ్చినా లక్ష్యాన్ని వీడలేదు. ఆయనెవరో కాదు బక్కపలచని దేహం, ఉక్కు సంకల్పం కలిగిన కేసీఆర్. ఈ పేరే తెలంగాణ భావోద్వేగం.

ఈ మూడక్షరాల కేసీఆర్ పేరు చర్చలకు కేంద్ర బిందువు. ప్రత్యర్థులకు కొరకరాని కొయ్య, అంతుచిక్కని పద్మవ్యూహం. ఈ బక్కమనిషితో ఏమవుతుందిలే అనుకున్నారంతా! కానీ, ఆయన చూపించే చుక్కలు చూసి నివ్వెరపోయారంతా. ఇందుకు కేసీఆర్ చేసిందొక్కటే, తెలంగాణను ఓన్ చేసుకోవడమే. తెలంగాణ ఆవశ్యకతను ఆయన ప్రజలకు వివరించారు. రాజీనామాలతో ప్రజల్లో తెలంగాణ వాదాన్ని బలోపేతం చేశారు. ఉప ఎన్నికలతో ఉద్యమానికి ఊపిరి పోశారు. తెలంగాణ ప్రజలు మెల్లగా కేసీఆర్‌ను ఓన్ చేసుకున్నారు. అదీ కేసీఆర్‌కు, తెలంగాణ ప్రజలకు ఉన్న బంధం. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట చర్చను దేశవ్యాప్తం చేయటమే కాకుండా, బలమైన సమైక్య లాబీయింగ్, కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు తెలంగాణ ఇవ్వక తప్పని అనివార్య పరిస్థితిని తీసుకువచ్చారు. ఈ ప్రయాణంలో తెలంగాణ కోసం కేసీఆర్ ఎక్కిన కొండలు ఎన్నో, మొక్కిన బండలు ఎన్నో, కన్నీళ్లు కార్చిండు, సింహమై గర్జించిండు. మొత్తానికి ఒక యుద్ధమే చేసిండు. లేకుంటే సమైక్యవాది చంద్రబాబుతో 'జై తెలంగాణ' అనిపించడం, సోనియాగాంధీతో పొత్తు పెట్టుకుని కాంగ్రెస్‌ను ఒప్పించడం, తెలంగాణ కోసం తాను గీసిన బరిలోకి ప్రతీ పార్టీని లాగిండు కేసీఆర్. తెలంగాణ ఇవ్వక తప్పని అనివార్య పరిస్థితి తీసుకువచ్చి ప్రత్యర్థులను మట్టి కరిపించి తెలంగాణ సాధించిండ్రు కేసీఆర్.

తెలంగాణ తేవడమే కాదు, తెచ్చిన తెలంగాణను అభివృద్ధి చేసి దేశంలో అగ్రపథాన నిలిపారు. ఇలా... కొందరు నాయకులవుతారు. కొందరు సేవకులవుతారు. కానీ, కేసీఆర్ మాత్రం తెలంగాణ ప్రజల భావోద్వేగం అయ్యారు. ఇవన్నీ రాత్రికి రాత్రే వచ్చిన విజయాలు కాదు. పద్నాలుగేండ్ల పోరాటం, పదేండ్ల నిరంతర కృషి. మొత్తంగా తెలంగాణ ప్రజల కోసం ఆయన పడ్డ శ్రమకు ప్రతిఫలమే రానున్న రజతోత్సవం. ప్రస్తుత పాలకులు చేస్తున్న విమర్శలు ఆయనకు గడ్డిపోచతో సమానం. ఏనుగు పోతా ఉంటే వీధి సింహాలు అరుస్తూనే ఉంటాయి. అంతమాత్రాన ఏనుగు వెనుకడుగు వేస్తుందా? అస్సలే వేయదు. కాబట్టి, ప్రస్తుత పాలకులు తెలుసుకోవలసిందేమంటే అధికారం ఏ ఒక్కరికీ శాశ్వతం కాదు. సాధించిన కీర్తి, ప్రజల్లో పొందిన ప్రేమనే శాశ్వతం. అందుకే, తెలంగాణ అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే తెలంగాణ అని గుర్తుకువస్తుంది. కేసీఆర్ ఆనవాలు చెరిపేస్తామని, కేసీఆర్ అనే మొక్కను మొలవనివ్వమని వెకిలి మాటలు మాట్లాడుతుండచ్చు. కానీ, కేసీఆరే మొక్క కాదు, రాష్ట్ర ప్రజలకు చల్లని నీడనిచ్చే ఓ మహావృక్షం. ఆయనను ప్రజల నుంచి దూరం చేస్తామనుకోవడం అత్యాశే అవుతుంది. అలా అనుకున్నవాళ్లంతా పత్తా లేకుండా పోయారనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకుంటే వారికే మంచిది..

- తెలంగాణ విజయ్

కలుపు మొక్కనెలా కలుపుకొని సాగడం?

'మన శత్రువులు వేర్వేరు రూపాలను తీసుకొని ఉండవచ్చు, కానీ మనం మారలేదు. మన పోరాటాలు మారలేదు. అదే డీఎంకే' అని కలైవానర్ అరంగంలో 2024, అక్టోబర్ 5న ఆ పార్టీ ఎంపీ తిరుచ్చి శివ రాసిన ఐదు పుస్తకాలను ఆవిష్కరించిన సందర్భంగా తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సందేశమిచ్చారు. ప్రఖ్యాత వర్ధమాన సినీ నటుడు, ప్రగతిశీల వాది అయిన ప్రకాష్‌రాజ్ కూడా పాల్గొన్న ఆ సమావేశంలోనే చరిత్రను మార్చడానికి, పుకార్లను వ్యాప్తి చేయడానికి, అసత్యాల ఆయువు పెంచడానికి రాజకీయ శత్రువులు నిరంతరం చేసే ప్రయత్నాలను ఓడించడానికి సత్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంచడమే పరిష్కారమని కూడా అన్నారు.

డాక్టర్ ఆంజనేయ గౌడ్

నిజమే, సాంఘిక దురాచారాలు, ఆత్మగౌరవం, తమిళ అస్తిత్వం అంశాలపై ఎటువైపు నుంచి దాడి ఎదురైనా, ఏ శక్తులతో తలపడాల్సిన సందర్భం ఎదురైనా డీఎంకే నిర్మాతలైన అన్నాదురై నుంచి కరుణానిధి వరకు పెరియార్ మార్గాన్ని మదిలో ఉంచుకునే జనాన్ని నడిపించారు. జస్టిస్ పార్టీ, ద్రవిడార్ కళగం అనుభవాల నుంచి తమిళనాడు రాష్ట్ర రాజకీయ అస్తిత్వం కోసం ద్రవిడ మున్నేట్ర కళగం చాలా స్పష్టమైన కార్యాచరణనే సుదీర్ఘ కాలం ఆచరణాత్మకంగా నమ్ముకున్నది. దానివల్లనే ఒక ప్రాంతీయ పార్టీ ఏడున్నర దశాబ్దాల పాటు క్రియాశీలకంగా మనుగడ సాగించడమే కాదు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని సంపాదించగలిగింది. అయితే తాజాగా స్టాలిన్ నేతృత్వంలో ఆ పార్టీ ప్రారంభించిన డీ లిమిటేషన్ వ్యతిరేక పోరాటంలో దక్షిణాది రాష్ర్టాల హక్కుల నినాదంతో పాటు ఎన్నికల రాజకీయాల్లో తమిళ ఏజెండాను భావోద్వేగ అంశంగా నిలబెట్టి, రాజకీయ విరోధులను నిలువరించాలనే డీఎంకే సహజమైన ఎత్తుగడ కూడా ఇమిడి ఉన్నదనేది ఎవరూ కాదనలేని వాస్తవం. అయితే ఆ పార్టీ ఎత్తుకున్న డీ లిమిటేషన్ వ్యతిరేక పోరాటాన్ని, త్రిభాషా విధానానికి నిరసనగా వినిపిస్తున్న వాదనను యూజీసీ ప్రతిపాదనల వెనుక రాష్ర్టాల హక్కుల హననం వైఖరిని తేటతెల్లం చేయడాన్ని సమాఖ్య విధానాన్ని, రాజ్యాంగస్ఫూర్తిని విశ్వసించే వారెవరైనా సమర్థించి తీరవలసిందే. అయితే, తమిళనాడు ప్రయోజనాలకు, ఆత్మ గౌరవానికి స్వాతంత్య్రానికి పూర్వం, అనంతరం బలమైన విరోధిగా నిలబడిన కాంగ్రెస్ పార్టీని కూడా తాజాగా ప్రతిపాదిస్తున్న పోరాట జట్టులో కలుపుకొని సాగాలనే అంశంపైనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాకుండా ఉండలేవు.

ఆనాటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని అన్యాయమైన విధానాల నుంచి ఇండిపెండెంట్ ఇండియాలో సుదీర్ఘకాలం తమిళనాడు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొన్న దుఃఖపూరితమైన అనుభవాలకంటే ఎన్నో రెట్ల ఎక్కువ వేదనను తెలంగాణ రాష్ట్రం అనుభవించిందన్నది చరిత్ర చెప్పున్న సత్యం. భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్లు చెల్లనేరవని న్యాయస్థానాలు తప్పుపట్టడంపైనే పెరియార్ నిప్పుల వర్షం కురిపించారు.

సిరా రాతలు ఆరకమునుపే దేశ రాజ్యాంగాన్ని బ్రాహ్మణ డాక్యుమెంట్‌గా వర్ణించి, ప్రత్యేక ద్రవిడనాడు దేశమే కావాలంటూ వేర్పాటు ఉద్యమాన్ని రగిలించాడు. దాంతో మొదటి ప్రధాని నెహ్రూ రాజీకి వొచ్చేలా, తొలి రాజ్యాంగ సవరణ జరిగేలా చేసి, స్వతంత్ర దేశంతో అడుగులు కలపడంలోనే హక్కుల పట్ల రాజీలేనితనాన్ని తమిళజాతి చూపించగలిగింది. అదే స్ఫూర్తితో 1949లో మొదలైన డీఎంకే, కాంగ్రెస్ పార్టీ అన్యాయమైన రాజకీయాలను ప్రజల్లో ఎండగడుతూ, ఎట్టకేలకు 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి అధికారం హస్తగతం చేసుకున్న తొలి ప్రాంతీయ పార్టీగా చరిత్రలో నిలిచింది.

ఇలా చాలా స్పష్టాతి స్పష్టంగా తొలి నాటనే తమ రాష్ట్ర ఆత్మగౌరవానికి రాజకీయ శత్రువు కాంగ్రెస్ పార్టీనే అనే కీలక అంశాన్ని సైద్ధాంతికంగా ద్రవిడియన్ భావజాలంలో మిళితం చేసి ప్రజలందరి హృదయాల్లో నాటగలిగింది. అయితే, 2014 నాటికే పూర్తిగా తమిళనాట కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా నిర్వీర్యం చేసి, డీఎంకే ఆశ్రిత సంస్థగా లొంగదీసుకోగలిగింది. అయితే డీఎంకే మూల సిద్ధాంతకర్తలైన పెరియార్, అన్నాదురై విశ్వసించిన ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, రాష్ర్టాల ఆత్మ గౌరవం తదితర మౌలికమైన రాజ్యాంగ అంశాల పట్ల అధికారంలో ఉన్న రాష్ర్టాలలో ఒక తీరున, విపక్షంలో ఉన్న రాష్ర్టాల్లో మరో తీరున అపరిచితుడు సినిమాలో వలె భిన్న మొహాలతో ప్రవర్తిస్తున్న కాంగ్రెస్ పార్టీని కూడా రాష్ర్టాల హక్కుల సాధన పోరులో కలుపుకొని సాగాలనుకోవడంపై ఏకాభిప్రాయానికి రావడం కష్టం. కాంగ్రెస్ అనే కలుపు మొక్కను కూటమిలో పెట్టుకొని రాష్ర్టాల హక్కుల ఉద్యమాన్ని ప్రాంతీయ రాజకీయశక్తులు కొనసాగించడం ఏమిటనే ఆందోళన వ్యక్తమౌతున్నది. రాజ్యాంగానికి తూట్లు పొడవడంలో, సమాఖ్య స్ఫూర్తికి కళంకం తేవడంలో, కాంగ్రెసేతర గవర్నమెంట్‌లను కూలదోయడంలో, అంతెందుకు బడుగు వర్గాలకు అవకాశాలను దూరం చేయడంలో హస్తం పార్టీ అతి పెద్ద పాపాలపుట్టనే కదా? నంబుద్రిపాద్ నుంచి ఎన్టీఆర్ దాకా దక్షిణ భారతదేశంలో కాంగ్రెసేతర ప్రభుత్వాలను కూల్చివేసిందే కాంగ్రెస్ పార్టీ.

డీ లిమిటేషన్‌తో పాటు హిందీ భాష, యూజీసీ నిబంధనల వివాదంలో తొలి అడుగు వేసిందే కాంగ్రెస్ పార్టీ కేంద్ర సర్కార్లు. 1937లోనే నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తే, మూడేండ్ల పాటు ఉధృతంగా వ్యతిరేక పోరాటం నడిచింది. దానివల్లనే హిందీ, ఇంగ్లీష్‌లను అధికార భాషలుగా గుర్తించారు. మళ్లీ 15 ఏండ్ల తర్వాత హిందీని ఇదే కాంగ్రెస్ పార్టీ సర్కార్ జాతీయ అధికార భాషగా ప్రకటించే ప్రయత్నం చేసింది.

అయితే తమిళనాడు వ్యతిరేకతకు జడిసి 1963 అధికార భాషా చట్టంలో హిందీతో పాటు ఇంగ్లీష్‌ను చేర్చారు. అలాగే, 2009, 2011లో రాష్ర్టాల విద్యాహక్కులు హరించే ప్రయత్నం కాంగ్రెస్ చేసింది. పశ్చిమబెంగాల్, తమిళనాడు నిరసించడం వల్లనే వెనక్కి తగ్గారు. ఇలాంటి ధోరణిలో బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే. అంతెందుకు రిజర్వేషన్ల కోసమే ప్రత్యేక ద్రవిడనాడు పోరాటం చేసిన తమిళనాడు రాష్ట్ర మేధావులు, నేతలకు.. ప్రత్యేక దేశంగా, అనంతరం ప్రత్యేక రాష్ట్రంగా వర్ధిల్లిన తెలంగాణపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎలా దాడి చేసి, ఐదున్నర దశాబ్దాలు ఎలా అడుగడుగునా వంచించిందో చరిత్ర సాక్షిగా తెలియకుండా ఉండదు. తమిళనాడు కంటే తెలంగాణ, డీఎంకే కంటే బీఆర్‌ఎస్ ఎన్నో రెట్లు ఎక్కువ నిర్బంధాన్ని, నష్టాన్ని, కష్టాలను కాంగ్రెస్, బీజేపీల వల్ల అనుభవించాయి. ఎంతో వైవిధ్యమైన ఉన్నతమైన చరిత్రనూ, త్యాగాలనూ తెలంగాణ ప్రజలు పండించారు.

కానీ, తెలంగాణలో హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ నుంచి మంత్రివర్గ విస్తరణ వరకు, ప్రతి పైసా ఖర్చుపెట్టడం కోసం 37 సార్లు ఢిల్లీ వెళ్లి, గాంధీల అనుమతి తీసుకునే పరిస్థితి ఏర్పడింది. ఇది త్యాగాల తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు బలితీసుకోవడం కాదా? ఇలా ఇంకా మారని, మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రాంతీయ రాజకీయ శక్తులను వేటాడుతామని కేజ్రీవాల్ ఉదాహరణతో తేటతెల్లం చేస్తున్న కాంగ్రెస్‌ను కలుపుకొని సాగడం వల్ల ప్రాంతీయ పార్టీలకు, రాష్ర్టాలకు ముప్పే. బీఆర్‌ఎస్, డీఎంకే తదితర పార్టీల పుట్టుక, సుదీర్ఘ పోరాటం, త్యాగాల వెనుక ప్రాంతీయ ఆకాంక్షలున్నాయి. కాబట్టి డీఎంకే తాజా పోరాట ఎజెండాలో ఎంత న్యాయమున్నదో, జట్టులో కపట కాంగ్రెస్‌ను కలుపుకొనిపోవడంలో అంతే నష్టమున్నది. పైగా అధికారంలో ఉన్నంత మాత్రాన తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి లాంటి ఢిల్లీ దళారీ పాలకుల నేతృత్వంలో రాష్ర్టాల హక్కుల సాధన పోరు రెండో సమావేశం జరపాలని నిర్ణయించడం ప్రజాస్వామ్యవాదులకు ఎబ్బెట్టుగా అనిపిస్తున్నది. డీఎంకే, బీఆర్‌ఎస్ తలపెట్టిన పోరాటాన్ని, కాంగ్రెస్ కలుపుమొక్కను తీసేసి కొనసాగించగలిగితే, ఈ జట్టులో అధికారంలో లేకపోయినా సరే మిగతా ప్రాంతీయ పార్టీలు, సంఘాలు, మేధావులను భాగస్వాములుగా మార్చగలిగితే మంచిది.

కాంగ్రెస్ పార్టీ వైఖరి ఇప్పటికైనా మారిందా అంటే వెయ్యి జీవులను మింగిన రాబందు, మళ్లీ అవకాశం కోసం ఆవు మొహం పెట్టుకొని తిరుగుతున్న విధంగానే ఉన్నది. అందుకే మొన్నటికి మొన్న ఇండియా కూటమిలోనే ఉన్న ఢిల్లీ రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించేందుకు పావులు కదిపి, బీజేపీ గెలుపునకు సహకరించింది. ఈ కుట్రను స్వయంగా రేవంత్ రెడ్డే బయటపెట్టాడు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కేజ్రీవాల్ పార్టీ ఓటమికి వ్యూహాలు పన్నిందే కాంగ్రెస్ పార్టీ అని బీరాలు పలికాడు.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

ఉద్యోగాలు ఉండకపోవచ్చు!

భవిష్యత్తులో మనందరికీ ఉద్యోగాలు ఉండకపోవచ్చు. ఏఐ, రోబోలు అన్ని పనులూ చేసేస్తాయి. మనుషులు ఉద్యోగాలు చేయడం హాబీగా మారవచ్చు. మనం కోరుకున్న సేవలు, వస్తువులన్నిటినీ ఏఐ, రోబోలు సమకూరుస్తాయి. అయితే ఇది జరగాలంటే ప్రపంచంలో అందరికీ అధిక ఆదాయం ఉండాలి. మరో మాటలో చెప్పాలంటే ఎవరూ పనిచేయకపోయినా ఆదాయానికి మాత్రం కొదవ ఉండకూడదు.

-ఎలాన్ మస్క్